క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



శేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే గంగమ్మ దేవాలయ సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి, సాయిబాబా దేవాలయాలలో భక్తులు పూజలు చేశారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ ప్యానెల్

సింహాద్రిపురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీలకు ఇంటిపైన ఉచితంగా సోలార్ ప్యానెల్ బిగించడానికి అవకాశం కల్పించామని ఇన్‌చార్జి ఏఈ దినేష్‌కుమార్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు సర్వీసు ఎవరిపైన ఉంటే వారి ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్‌లను సంబంధిత విద్యుత్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

వేంపల్లె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఉన్న వైఎస్సార్ సభా భవనంలో మంగళవారం ఎంపీపీ లక్ష్మీగాయత్రి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కుళాయమ్మ తెలిపారు. ఈ సమావేశంలో తాగునీరు, విద్యుత్, వ్యవసాయం, ఉపాధి హామీ పథకం, వెలుగు, వైద్యం, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్, తదితర శాఖలపై సమీక్ష చేయడం జరుగుతుందని, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు సమీక్ష సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ప్రజాప్రతినిధులు కూడా సమీక్ష సమావేశానికి వచ్చి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తొండూరు : మండలంలోని బూచుపల్లె, బోడివారిపల్లె గ్రామాల్లో ఆదివారం డాక్టర్ పాల్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ ట్రస్ట్, యేసుక్రీస్తు ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి వైద్యులు డాక్టర్ మీనాక్షి, డాక్టర్ సంజీవ్ కర్ణ్, ఉదయ్‌కుమార్‌లు ప్రజలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఈ శిబిరం నిర్వహించామని ట్రస్ట్ చైర్మన్ పాస్టర్ అట్ల జయపాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు బాల పుల్లయ్య, రమణ, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రి గేషనల్ చర్చి సేవలు ప్రశంసనీయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో అతి పురాతమైన చర్చిగా పేరొందిన కాంగ్రిగ్రేషనల్ చర్చి కమిటీ కార్యవర్గం అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని క్రైస్తవ ప్రముఖులు పాస్టర్ రెవరెండ్ మోహన్‌బాబు తెలిపారు. ఆదివారం కాంగ్రిగేషనల్ చర్చి 200 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంతోపాటు నూతన భవన ప్రారంభాన్ని పురస్కరించుకుని క్రైస్తవ గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రి గేషనల్ చర్చికి విశేష గుర్తింపు ఉందన్నారు. నాడు లండన్ మిషనరీ వారు ఏర్పాటు చేసిన ఈ చర్చి కాలక్రమంలో అభివృద్ధి అవుతూ భక్తుల ప్రార్థనలతో అలరారుతోందన్నారు. విశ్వాసుల ప్రార్థనలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు చర్చిని అన్ని విధాలా అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్న కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు.

పతనమైన అరటి ధరలు

● లబోదిబోమంటున్న రైతులు



ఎగుమతి చేసేందుకు అరటి కాయలను సిద్ధం చేస్తున కూలీలు



అరటి తోటలో కోతకు సిద్ధంగా ఉన్న అరటి గెలలు

లింగాల : పులివెందుల ప్రాంతంలో ప్రధాన పంటగా సాగు చేస్తున్న అరటి ధరలు ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. 10 రోజుల క్రితం ఎగుమతి ధరలు రూ.23 వేల నుంచి రూ.24 వేల వరకు ధరలు పలికేవి. వర్షాలు ప్రారంభమైన వెంటనే ఎగుమతులు ఆగిపోయాయంటూ వ్యాపారులు ధరలు ఒక్కసారిగా తగ్గించేశారు. దీంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. గత 5 నెలల క్రితం వర్షాలు, ఈదురు గాలులకు అరటి తోటలు కుప్పకూలి అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం అరటి ధరలు ఆశాజనకంగా ఉన్నాయని భావిస్తున్న సమయంలో ఒక్కసారిగా ధరలు తగ్గడంతో అరటి రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. అదే విధంగా లోకల్ మార్కెట్‌లో అరటి కాయలు టన్ను రూ.10 వేల నుంచి రూ.11 వేలకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో పంటలకు సాగు చేసేందుకు పెట్టిన పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొనడంతో వ్యాపారుల చుట్టూ రైతులు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని అరటి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

అరటి రైతుల పరిస్థితి అగమ్యగోచరం



రైతులు ఏడాదిపాటు కష్టపడి అరటి పంట పండిస్తే దళారులు చెప్పిన ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు ధరలు నిర్ణయించుకునే అవకాశం కూడా లేదు. వారు చెప్పిన ధరలకే పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అరటి పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

– ప్రభాకర్‌రెడ్డి, అరటి రైతు, లింగాల

అరటి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి



ప్రజలు కొనుగోలు చేసి ప్రతి వస్తువుకు నిర్దిష్టమైన ధరలు ఉన్నాయి. అవి ప్రతి ఏటా పెరుగుతూ పోతున్నాయి. రసాయనిక ఎరువులు, పురుగు మందులు, ధరలు పెరుగుతూ పోతున్నాయి. అయితే రైతులు పండించే అరటి, చీనీ పంటలు ప్రతి ఏటా ధరలు క్షీణిస్తూ వస్తున్నాయి. నిర్దిష్టమైన ధరలు లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి.

– చిన్నకేశవ, అరటి రైతు, లింగాల

విదేశాల్లో వైద్య విద్యపై అవగాహన



విద్యార్థినులకు బ్రోచర్ అందజేస్తున్న యూనివర్సిటీల ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిహార్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో వోక్స్ ఓవర్సీస్ సహకారంతో విదేశాల్లో ఎంబీబీఎస్ చదివే అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిహార్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ రీజినల్ కోఆర్డినేటర్ నాగమణి తెలిపారు. ఆదివారం కడపలోని జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ప్రాంగణంలో విదేశీ విద్యపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, విద్యార్థులకు విదేశాల్లో ఎంబీబీఎస్ చదువు, అవకాశాలు, వీసా ప్రాసెస్, స్కాలర్‌షిప్‌లు, యూనివర్సిటీ నిధులు వంటి అంశాలపై నిపుణులు సమగ్ర సమాచారం అందించారు. డాక్టర్ రాకేష్ సింగ్ (యూనివర్సిటీ ప్రతినిధి), షరీఫ్ (వోక్స్ ఓవర్సీస్ ప్రతినిధి) ప్రత్యేక అతిథులుగా పాల్గొని విదేశీ విద్య, ముఖ్యంగా ఎంబీబీఎస్ చదువుపై తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించారు. అనంతరం విదేశాల్లో ఎంబీబీఎస్ చదివే అవకాశాలపై రూపొందించిన బ్రోచర్‌ను విద్యార్థినులకు అందజేశారు.

జాతీయ రహదారిలో వెలగని విద్యుత్ లైట్లు



కొండాపురం జాతీయ రహదారిలో వెలగని వీధిలైట్లు

కొండాపురం : జాతీయ రహదారి(ఎన్‌హెచ్–67) నాలుగు వరసల రోడ్డు పనులు పూర్తి చేశారు. కానీ కొండాపురం పట్టణంలో జాతీయ రహదారి రోడ్డులో గుత్తేదారులు బిల్లుకోసం వీధిలైట్లు ఏర్పాటు చేశారు. టోల్‌గేట్ ప్రారంభించినా వీధి లైట్లు వెలగలేదని పలు మార్లు అధికారులకు మొర పెట్టుకొన్నా స్పందన కరువైంది. ఇటీవల కొండాపురంలో ఎదురు ఎదురుగా వస్తున్న వాహనాలు గమనించలేక రోడ్డు ప్రమాదంలో భార్య భర్తలిద్దరు మరణించారు. వీధిలైట్లు ఏర్పాటు చేసేటప్పుడు పంచాయతీ అధికారి, సర్పంచ్‌లకు ఎలాంటి అనుమతి లేకుండా వీధిలైట్లు ఏర్పాటు చేసి ఇప్పుడేమో పంచాయతీ పరిధిలోకి వస్తుందని ఎన్‌హెచ్ అధికారులు పేర్కొంటున్నారు. టోల్‌గేట్ పన్ను వసూల్ చేసి పంచాయతీ వాళ్లు ఎందుకు కట్టాలని మూడు నెలలు నుంచి వీధిలైట్లకు కనెక్షన్ ఇవ్వకపోవడంతో కొండాపురం ప్రజలు రోడ్డు క్రాస్ విషయంలో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

పెన్షన్ మార్చ్‌ను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో నూతన పెన్షన్ విధానం అమలు అయిన సెప్టెంబర్ ఒకటిన సీపీఎస్ రద్దు కోరుతూ విజయవాడలో తలపెట్టిన పెన్షన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్సార్ వెంకట జనార్ధనరెడ్డి కోరారు. స్థానికంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరం లోపు సీపీఎస్ సమస్యకు ఒక పరిష్కారం చూపుతామని చెప్పిందని, ఏడాదిన్నర గడిచినా సీపీఎస్ రద్దుపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ స్థానంలో నూతన పెన్షన్ తెచ్చి అందులో కూడా ఉద్యోగులకు కొద్దిగా మేలు జరిగేలా అనేక సంస్కరణలు చేసినా.. రాష్ట్ర ప్రభుత్వాలు ఆ సంస్కరణలు అమలు చేసిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 1న విజయవాడలో నిర్వహించే పెన్షన్ మార్చ్‌కు జిల్లా నలుమూలల నుంచి ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

గ్రామీణ రహదారి గుంతల మయం



అధ్వానంగా వున్న బొందలకుంట రహదారి



గుంతలతో ప్రమాదకరంగా వున్న రహదారి

ముద్దనూరు : మండలంలోని బొందలకుంట–ఆరవేటిపల్లె గ్రామాలకు వెళ్ళే రహదారి మొత్తం గుంతలమయంగా మారడంతో గ్రామస్తులు అవస్థలు ఎదుర్కుంటున్నారు. ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలోని ఉమ్మారెడ్డిపల్లె క్రాస్ నుంచి బొందలకుంటకు, అక్కడి నుంచి ఆరవేటిపల్లెకు వెళ్ళే రహదారి గత కొంతకాలం నుంచి అధ్వానంగా మారింది. వాహనాలు ప్రయాణించాలంటే ప్రమాదకరంగానూ, అసౌకర్యంగానూ వుందని రెండు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయంగా వున్న ఈ రహదారి వర్షంకురిస్తే మరింత అధ్వానంగా వుంటుందన్నారు. ఈ రహదారిలో ప్రయాణించాలంటే భయపడాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. అధికారులు త్వరగా ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాజకీయ నాయకుల బెదిరింపులు తగదు

పులివెందుల టౌన్ : వినాయక ఉత్సవ కమిటీపై రాజకీయ నాయకుల బెదిరింపులు తగదని జై హిందుస్థాన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వి.గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన ద్వారా తెలుపుతూ పులివెందుల పట్టణంలోని మైత్రి లేఅవుట్‌లో గత కొన్నేళ్లుగా వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కలిసికట్టుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, ప్రస్తుతం ఈ ఉత్సవ కమిటీ చైర్మన్ పదవిని సృష్టించి తామే చైర్మన్‌గా ఉండేందుకు అధికార పార్టీకి చెందిన కొంతమంది రాజకీయ నాయకులు కుట్రలు పన్నుతున్నారన్నారు. ప్రస్తుత ఉత్సవ కమిటీ సభ్యులను బెదిరింపులకు గురి చేస్తున్నారని, కొంతమంది అధికార పార్టీ నాయకులు ఉత్సవ కమిటీకి చైర్మన్ నియమించాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు.

ప్రస్తుత చైర్మన్‌గా తామే ఉంటామని, ఎవరైనా అడ్డుకుంటే ఉత్సవాల తర్వాత మీ సంగతి చూస్తామని కమిటీ సభ్యులను బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు దౌర్జన్యంగా అధికారాన్ని అడ్డు పెట్టుకుని కమిటీ చైర్మన్ పదవి కోసం పైరవీలు చేస్తున్నారన్నారు.

విలియం కేరి జీవితం.. ఆదర్శనీయం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బిషప్ సామెల్‌బాబు

కడప రూరల్ : విలియం కేరి జీవితం ఆదర్శనీయమని రెవరెండ్ బిషప్ కె.సామేలు బాబు అన్నారు. ఆదివారం స్థానిక ఎలిమ్ ప్రార్థన మందిరంలో విలియం కేరి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన జీవిత విశేషాల పైన కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం సామేలు బాబు మాట్లాడుతూ విలియం కేరి 1761లో ఇంగ్లాండ్‌లో జన్మించారన్నారు. ఆయన భారతదేశానికి మిషనరీగా వచ్చి, వెలకట్టలేని సేవలను అందించారని కొనియాడారు. ఈయన మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తెచ్చారని పేర్కొన్నారు. ఆల్ ఇండియా పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు విజయ భాస్కర్ మాట్లాడుతూ విలియం కేరి అటవీ పరిరక్షణపై రచనలు చేసిన మొదటి వ్యక్తి అని తెలిపారు.

అధ్వానంగా మారిన పారిశుద్ధ్యం



శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో మురికి నీటిలో ఉన్న పందులు

వేంపల్లె : వేంపల్లెలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. దీంతో వేంపల్లె గ్రామంలో ఎక్కడ చూసిన చెత్తతో కూడిన దిబ్బలు దర్శనమిస్తున్నాయి. దీంతో దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు పందుల బెడద ఎక్కువైంది. ప్రజలు దోమ కాటుకు గురై వ్యాధుల బారినపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఆదివారం విష జ్వరంతో విద్యార్థి రఘువరన్ మృతి చెందారు. ఆ విద్యార్థి ఇంటి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో పందుల కూడా కలియతిరుగుతున్నాయి. వేంపల్లెలో ఎక్కడ చూసినా చెత్తతో నిండిపోయి దిబ్బలుగా మారుతున్నాయి. దీంతో దోమలు విపరీతంగా పెరిగిపోవడం వలనే వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్తను అధికారులు తొలగించి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ కూడా సరిగా లేకపోవడం వలన వర్షపు నీరు కూడా ఎక్కడ పడితే అక్కడ నిల్వ ఉండటంతో ప్రజల ప్రాణాలకు నష్టం కలుగుతోందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రజలు పడుతున్న ఇబ్బందులపై దృష్టి పెట్టాలన్నారు. అలాగే వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు కూడా ఆయా ప్రాంతాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి రక్త పరీక్షలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

లాయీా బ్రెయిలీకి ఘన నివాళి



ఆశ్రమ వార్షికోత్సవ కేక్‌ను కట్ చేస్తున్న ఎస్ఐ విష్ణు నారాయణ

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీవీరనారాయణస్వామి అంధుల ఆశ్రమంలో ఆదివారం ఆశ్రమ 10వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎస్ఐ విష్ణునారాయణ, ప్రిన్సిపాల్ రామసుబ్బయ్యలు హాజరై లూయీా బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. మానవుని సేవయే మాధవ సేవ అని, అంధుల జీవితంలో చిరు దీపమే వెలిగించాలన్నారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ కొండారెడ్డి, ఆశ్రమ చైర్మన్ వెంకటమహేశ్వరి, ఆశ్రమ నిర్వాహకులు రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని రామాంజనేయపురం శ్రీ సాయి శ్రీనివాస గార్డెన్ ఎదురుగా జర్నలిస్టు కాలనీ బోర్డు పక్కన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు వృథా అవుతోంది. గతంలో ఇక్కడ మరమ్మతులు చేసినప్పటికీ లీకేజీ ఆగలేదు. నీరు యథావిధిగా వృథా అవుతూనే ఉంది. ఈ పైపులైన్ లీకేజీ వల్ల చుట్టు పక్కల బురదగా మారి రోడ్డు కూడా పాడవుతోంది. మెయిన్ రోడ్డుకు, అప్రోచ్ సీసీ రోడ్డుకు మధ్య పెద్ద గుంతలాగా ఏర్పడింది.

ఆప్కాస్ కార్మికులను తొలగించడం తగదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరపాలక సంస్థ పరిధిలో చెత్తపన్ను వసూళ్లలో జరిగిన అవకతవకల్లో ఆప్కాస్ చిరు కార్మికులను తొలగించి, పర్మినెంట్ కార్మికులను సస్పెండ్ చేయడం తగదని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించడం చట్ట విరుద్ధమని అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో పది నెలల కాలంలో కమర్షియల్ షాపుల నుంచి వసూలు చేసిన చెత్త పన్ను వసూళ్లపై మాత్రమే విచారణ జరిపించి కార్మికులు, ఉద్యోగులను బలిపశువులు చేయకుండా.. గత ప్రభుత్వంలో క్లాఫ్ మిత్ర ఇంటింటికి చెత్త పన్ను వసూళ్లపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అవకతవకల్లో జరిగిన సొమ్ము కార్మికులు, ఉద్యోగుల నుంచి రికవరీ చేసి తొలగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయడంతోపాటు తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు పి.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

బుగ్గవంకపై బ్రిడ్జిలు నిర్మించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : బుగ్గ వంకపై షామీరియా, లా కాలేజీ వద్ద బ్రిడ్జిలు వెంటనే నిర్మించాలని ఏఐసీసీ కోఆర్డినేటర్ ఎస్‌ఏ సత్తార్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాసిర్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఆదివారం షామీరియా మసీదు బుగ్గవంక రక్షణ గోడ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2001లో వచ్చిన బుగ్గవంక వరద లకారణంగా కడప నగరంలో ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందన్నారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బుగ్గ వంకపైన ఆరు శాశ్వత బ్రిడ్జిలు నిర్మించిందని తెలిపారు. బుగ్గ వంక రక్షణ కూడా మంజూరు చేసిందన్నారు. అనంతరం వచ్చిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం రవీంద్రనగర్ బ్రిడ్జి మాత్రమే నిర్మించిందన్నారు. బుగ్గవంక రక్షణ గోడ పనులు మొదలు పెట్టినప్పటి నుంచి షామీరియా, లా కాలేజీ వద్ద హై లెవెల్ బ్రిడ్జిలు నిర్మించాలని ఆందోళనలు చేసినా నిర్మించలేదన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీ కృష్ణుడి ప్రతిమను పురవీధుల్లో ఉరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

జమ్మలమడుగు రూరల్ : శ్రీ కృష్ణాష్టమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని ఎంపీ మునిరెడ్డి కాంప్లెక్స్ ఆవరణలో శ్రీ కృష్ణుడు విగ్రహాన్ని ఏర్పాటు చేసి రెండు రోజుల నుంచి ప్రత్యేక పూజలు, భగవద్గీత శ్లోక పారాయణం నిర్వహించారు. 2వ రోజు శ్రీ కృష్ణుని ప్రతిమను పట్టణంలోని పురవీధుల గుండా ఉరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గ్రామంలో నీటి ఎద్దడి

● పైప్‌లైన్‌లు పగిలాయంటూ గుంతలు తవ్వారు



గుంతలతో వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న ఆటో



హైలెవల్ ట్యాంక్‌వద్ద తవ్విన గుంతలు

జమ్మలమడుగు : పెద్దముడియం మండలం పెద్దపసుపల గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో అతిపెద్ద గ్రామం పెద్దపసుపల. తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జమ్మలమడుగు మండలం పెన్నానది సమీపంలో ఉన్న ధర్మాపురం గ్రామం వద్ద నుంచి మోటార్ల ద్వారా పెద్దపసుపల గ్రామానికి నీటిని సరఫరా చేస్తూ వచ్చారు. అంతేకాకుండా గ్రామంలో బోర్లు వేసి మోటర్ ద్వారా ప్రజలకు నీరు అందించేవారు. అలాగే మైలవరం జలాశయం నుంచి సీపీడబ్ల్యూ స్కీం కింద గ్రామాలకు సురక్షిత మంచినీటిని అందిస్తున్నారు. గ్రామంలోని ప్రజలకు తాగునీరు ఇబ్బందులు లేకుండా మూడు స్కీంల ద్వారా ప్రజలకు తాగునీరు అందించేవారు. ప్రస్తుతం ధర్మాపురం నుంచి గ్రామస్తులకు తాగునీరు అందడంలేదు. పైగా గ్రామపంచాయతీ ద్వారా వేసిన బోర్ల ద్వారా ప్రజలకు నీరు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం మైలవరం సీపీడబ్ల్యూస్కీం ద్వారానే కొంత మందికి మాత్రమే తాగునీరు అందుతుంది. మిగతా వారు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

పైప్‌లైన్ పగిలిందని...

గ్రామంలో తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ పగిలిపోవడంతో పంచాయతీ అధికారులు లీకేజిలను గుర్తించడం కోసం గ్రామంలో గుంతలు తవ్వారు. తవ్వి వారం అయినా ఇంత వరకు లీకేజిలను గుర్తించలేదు. తీసిన గుంతలు పూడ్చలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదేమని అడిగితే నీరు వచ్చినప్పుడు లీకేజిలు బయటపడతాయని అందు వల్ల అలాగే వదిలేశామని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారంటూ ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం వీరు తీసిన గుంతల్లో వాహనాలు పోవాలన్న ఇబ్బందులు పడవలసి వస్తుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. గ్రామంలో తాగునీటి సరఫరా చేయడం కోసం గ్రామంలో హైలెవల్ వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. అయితే ధర్మాపురం స్కీం కింద నీరు రాకపోవడంతో ట్యాంకులోనికి నీరు నింపలేకపోతున్నారు. వెంటనే అధికారులు జోక్యం చేసుకుని ప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చాలంటూ వారు కోరుతున్నారు.